ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర

సంపుటి : 13
సంచిక : 246

పేజీలు : 5 వెల రూ. 2/-

ఆదివారం
28 సెప్టెంబర్ 2025

*PUBLISHED FROM :*
HYDERABAD

# AM న్యూస్

ప్రతిదినం ప్రత్యేకం

www.amnews7.com

## భారత్ - పాక్..
## తొలిసారి టైటిల్ పోరులో దాయాదులు

- నేడు ఆసియాకప్ ఫైనల్ - జోరుమీదున్న టీమ్ఇండియా - ఒత్తిడిలో పాకిస్థాన్



2 లో

### పేదలకు భూములివ్వడం
## అసాధ్యం..

- కనీసం శ్మశానానికి కేటాయించేందుకూ జాగ లేదు: రేవంత్
- పంచడానికి భూముల్లేవు
- ఇంజినీరింగ్ పిల్లలే గంజాయి సరఫరా చేస్తున్నరు
- ఏటీసీల ప్రారంభోత్సవంలో రేవంత్



2 లో


# విజయ్ సభలో తొక్కిసలాట..

- 38 మంది మృతి.. పిల్లలే అధికం
- వందలాది మందికి గాయాలు కరూర్‌లో ఘటన
- కరూర్‌లో రాత్రివేళ తొక్కిసలాట.. 38 మంది మృతి
- స్పృహ తప్పిన 30 మంది.. మృతుల్లో 8 మంది పిల్లలు
- అధినేత కోసం ఆరు గంటల నిరీక్షణ
- విషయం తెలిసినా ప్రసంగం కొనసాగించిన టీవీకే అధినేత



2 లో

# 4న ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం



2 లో

దీపావళికి ముందే పేదలకు 3 లక్షల ఇళ్లు
ఊపిరి ఉన్నంత వరకు
పేదల కోసమే పని చేస్తా
శాసనసభలో 'సూపర్ సిక్స్‌పై చర్చలో
ముఖ్యమంత్రి చంద్రబాబు
ఎమ్మెల్యేలు వ్యక్తిగత ఎజెండాతో మాట్లాడితే
అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని వ్యాఖ్య

### ఉస్మాన్‌సాగర్ 15 గేట్లు ఎత్తడంతో
# హైదరాబాద్ నగరానికి భారీ వరద

- 6 వంతెనలపై రాకపోకలు బంద్.. 12 కాలనీల మునక
- ఎంజీబీఎస్‌ను ముంచెత్తిన ప్రవాహం
- ఆర్టీసీ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి: సీఎం

2 లో



# 4న ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం

అమరావతి:
ఊపిరి ఉన్నంతకాలం పేదల కోసమే పని చేస్తానని, అనునిత్యం వారి కోసమే ఆలోచిస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు కట్టుబడి అన్నీ చేస్తున్నామన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని వెల్లడించారు. శాసనసభలో శనివారం ఆయన మాట్లాడుతూ.. 'డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్నందునే 15 నెలల్లో ఎన్నో కార్యక్రమాలు చేయగలిగాం. ప్రధాని మోదీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల సహకారంతో ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోంది. ఇదో జట్టు. ఇందులో ఏ ఒక్కరు తప్పు చేసినా, విఘాతం కలిగించేలా వ్యవహరించినా రాష్ట్రానికి చాలా నష్టం జరుగుతుంది. ఎమ్మెల్యేలు వ్యక్తిగత ఎజెండా పెట్టుకుని మాట్లాడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి ఆటంకం కలుగుతుందని గుర్తుంచుకోవాలి' అని అన్నారు. ఎమ్మెల్యేలందరూ రాష్ట్రాన్ని పునర్ నిర్మాణం చేయడానికి పని చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు సేవ చేసే అవకాశం అందరికంటే తనకే ఎక్కువ కల్పించారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు రూ.15,000 సాయం అందజేసే 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమాన్ని అక్టోబరు 4న ప్రారంభించనున్నామని వివరించారు. ఏదైనా కారణంతో ఎవరైనా అర్హుల పేరు లేకపోతే గ్రీవెన్స్ ద్వారా జాబితాలో చేర్చుతామన్నారు. ఈ పథకంలో 2,90,234 మంది లబ్ధిదారులుగా ఉన్నారని, రూ.435 కోట్లు ఖర్చు చేయనున్నామని వివరించారు. గత ప్రభుత్వం రూ.12,000 మాత్రమే ఇవ్వగా, తాము రూ.15,000 ఇవ్వనున్నామని వెల్లడించారు. సీఎం ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ఇస్తున్నాం..

"ప్రతినెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పింఛన్లకు ఎంతో ఆలోచించి 'పేదల సేవలో' అని పేరు పెట్టాం. ప్రతినెలా పింఛన్లు అందించే కార్యక్రమంలో పాల్గొనడం నాకు చాలా సంతృప్తినిస్తోంది. గత ప్రభుత్వం.. వాలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేమంది. వృద్ధులు లైన్‌లో నిలబడి చనిపోతే వైకాపా వారు ఆనందపడ్డారు. ఇప్పుడు సచివాలయ సిబ్బందితో కలిసి తొలిరోజునే 97% పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రంలో 63.50 లక్షలమంది పింఛన్ల కోసం నెలకు రూ.2,745 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఏడాదికి రూ.32,143 కోట్లు వ్యయం చేస్తున్నాం. పింఛన్లు అందుకుంటున్న వారిలో 59% మంది మహిళలే ఉన్నారు. దేశంలో మన తర్వాత తెలంగాణ ఏడాదికి రూ.8,179 కోట్లు, కేరళ రూ.7,295 కోట్లు పింఛన్లకు ఖర్చు చేస్తున్నాయి. పెన్షన్ తీసుకునే 1,57,938 మంది భర్తలు చనిపోతే వారి భార్యలకు వితంతు పింఛను వెంటనే మంజూరు చేశాం.

సంతృప్తినిచ్చిన పథకం..

"మహిళలకు ఆర్థిక స్వావలంబన కోసం 'స్త్రీశక్తి' పథకాన్ని తీసుకొచ్చాం. ఈ పథకం నాకు చాలా సంతృప్తినిచ్చింది. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది ఈ పథకం అమలుకు సమర్థంగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో 8.86 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. దీనికి ఏడాదికి రూ.2,963 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. అయినా ఫర్వాలేదు. ఆనందంగా ఖర్చు పెడతాం. 'తల్లికి వందనం' పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందచేస్తున్నాం. ఆరుగురు పిల్లలున్నా వారి చదువు కోసం ఆర్థిక ప్రయోజనం అందించడంతో నా జన్మ సార్థకమైంది. 'దీపం-2' కింద మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లు అందజేశాం. దీనికి రూ.1,718 కోట్లు ప్రభుత్వం భరిస్తోంది.

ఏటా లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు

ఏటా లక్షమంది స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలో వెయ్యిమందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి. స్వయం సహాయక సంఘాల రుణాల రికవరీ అద్భుతంగా ఉంది. రాని బకాయిలు 1% మాత్రమే. చాలా పరిశ్రమలవారు, పెట్టుబడిదారులు రుణాలు తీసుకుని ఎన్పీఏలుగా మారుతున్నారు. కానీ, మహిళా సంఘాలు అప్పులను ఠంచనుగా తిరిగి చెల్లిస్తున్నాయి. మహిళా సంఘాల పొదుపు మొత్తం రూ.26.93 కోట్లు ఉంది.

రైతులకు అండగా నిలుస్తున్నాం..

రైతు కుటుంబం నుంచి వచ్చి అన్నదాతలను ఆదుకునే బాధ్యత తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. 'అన్నదాతా సుఖీభవ' కింద రూ.20,000 ఇస్తామని హామీ ఇచ్చాం. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద రూ.7,500 ఇస్తే కూటమి ప్రభుత్వం రూ.14,000 ఇస్తోంది. మామిడి, పొగాకు, కోకో, టమోటా వంటి పంటలను కొనుగోలు చేసి, రైతులను ఆదుకున్నాం. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50,000 చొప్పున ఇస్తున్నాం. ఆక్వా రైతులకు రూ.991 కోట్లు భరించి యూనిట్ రూ.1.50కే విద్యుత్తు ఇస్తున్నాం.

గూగుల్ అంత త్వరగా వస్తుందనుకోలేదు..

"2029 నాటికి 20 లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో పని చేస్తున్నాం. విశాఖకు త్వరలో గూగుల్ రాబోతోంది. రూపాయికే భూములు కేటాయించే విధానం గేమ్ ఛేంజర్‌గా మారింది. గూగుల్ ఇంత త్వరగా వస్తుందని అనుకోలేదు. లోకేశ్ వారితో మాట్లాడారు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు పెడితే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం వాటిని మరింత అభివృద్ధి చేసి, కొనసాగించింది. కానీ, ఏపీలో మన దౌర్భాగ్యం.. గత ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లను మూసివేశారు. వాటిని మళ్లీ ప్రారంభించాం. ఇప్పుడు 204 క్యాంటీన్లు ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటి వరకు 5.72 కోట్ల భోజనాలు పెట్టాం. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో 70 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నాం. ప్రతి దేవాలయంలో అన్నదానం చేపడతాం.

ప్రతి ఒక్కరికీ ఇల్లు

'పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా దీపావళికి ముందే 3 లక్షలమంది పేదలకు ఇళ్లు అందించనున్నాం. వచ్చే ఏడాది జూన్ నాటికి 6.15 లక్షల ఇళ్లను అందుబాటులోకి తెస్తాం. 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

విగ్రహాలే కదా అని హేళన చేశారు..

గత ప్రభుత్వంలో చాలా దేవాలయాల్లో అపవిత్ర కార్యక్రమాలకు పాల్పడ్డారు. రామతీర్థంలో రాముని తలను తీసేశారు. అంతర్వేదిలో రథాన్ని తగలబెట్టారు. దుర్గమ్మ గుడిలో వెండి సింహాలను దొంగిలించారు. ఇదేంటని ప్రశ్నిస్తే విగ్రహాలే కదా వేరేవి పెట్టుకోండని హేళనగా మాట్లాడారు. తితిదేలో చాలా అపచారాలు చేశారు. గత ప్రభుత్వంలో ఇసుకలో పెద్ద కుంభకోణం జరిగింది. ఇప్పుడు ఉచిత ఇసుకలో అక్రమాలు చోటుచేసుకోకుండా ఎమ్మెల్యేలే చూసుకోవాలి. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను త్వరలో తీరుస్తాం. పీ4లో భాగంగా 99,822 మంది మార్గదర్శకులు, 9,68,513 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఉస్మాన్‌సాగర్ 15 గేట్లు ఎత్తడంతో హైదరాబాద్ నగరానికి భారీ వరద

హైదరాబాద్, చంచల్‌గూడ, బేగంబజార్, కేతేపల్లి, :
మూసీ నది మహోగ్రరూపం దాల్చింది. 25 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా గరిష్ఠస్థాయిలో ప్రవహించింది. దీంతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, చాదర్‌ఘాట్, మూసారంబాగ్ పరిసరాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. మలక్‌పేట్ నియోజకవర్గం పరిధిలో 10 కాలనీలు, అంబర్‌పేట్‌లో రెండు కాలనీలు నీట మునిగాయి. దాదాపు 2వేల ఇళ్లు వరదలో చిక్కుకున్నాయి. ఎంజీబీఎస్ వద్దనున్న కుడి, ఎడమ వంతెనలతోపాటు నార్సింగిలోని మంచిరేవుల కాజ్‌వే, చాదర్‌ఘాట్ లో లెవల్, మూసారంబాగ్, గౌరెల్లి వద్ద వంతెనలపై నుంచి నీరు ప్రవహించడంతో శనివారం రాకపోకలకు అంతరాయం తలెత్తింది. దీంతో హైదరాబాద్ నగరం ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయింది. పలు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. మరోవైపు రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారాయణపేట జిల్లాలో పెంకుల షెడ్డు కూలి బాలుడు చనిపోగా.. వనపర్తి జిల్లాలో కొట్టుకుపోతున్న వ్యక్తిని పోలీసులు రక్షించి ప్రాణాలను కాపాడారు.

పురానాపుల్ నుంచి జియాగూడ వెళ్లే రోడ్డులో నీటిలో మునిగిన రాముడి ఆలయం

మూడు గంటల్లో ముంచెత్తి..

గండిపేట(ఉస్మాన్‌సాగర్) జలాశయానికి 25 కిలోమీటర్ల ఎగువన శంకరపల్లి వద్ద ఉన్న వంతెనపై ఆరు దశాబ్దాల్లో ఎప్పుడూ పది అడుగులకు మించి వరద రాలేదు. శుక్రవారం రాత్రి ఈ వంతెన వద్ద పదహారున్నర అడుగుల ఎత్తులో వరద నీరు గండిపేటకు చేరుకుంది. 3-5గంటల వ్యవధిలోనే జలాశయం నిండిపోవడంతో రాత్రి 8 గంటలకు ఉస్మాన్‌సాగర్ అన్ని(15) గేట్లు 9 అడుగుల మేర ఎత్తి 35,600 క్యూసెక్కుల ప్రవాహం దిగువకు విడుదల చేశారు. ఆ వరద నగరానికి చేరే సరికి రాత్రి 11గంటల సమయమైంది. దీంతో అర్ధరాత్రి ఎంజీబీఎస్‌ను చుట్టుముట్టి నీరు లోపలికి ప్రవేశించింది. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో.. ఆస్తి నష్టం ఎక్కువగా జరిగింది. 24 గంటల్లో 2 టీఎంసీల నీరు వదిలినట్లు అంచనా. ఎంజీబీఎస్ ప్లాట్‌ఫాంల వరకు నీరు చేరడంతో లోపల ఉన్న జనం భయంతో బయటకు పరుగు తీశారు.

రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం అప్పారెడ్డిగూడ వద్ద వాగు పొంగిపొర్లింది. ఓ కారు వాగును దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రవాహంలో చిక్కుకుపోగా.. స్థానికులు అందులోని వ్యక్తిని రక్షించారు.

మూసీ తన హద్దులను తాకుతూ ఉరకలెత్తడంతో.. లంగర్‌హౌస్ వద్దనున్న బాపూఘాట్ నీట మునిగింది.

పురానాపుల్ వద్ద నదిలో ఉన్న శివాలయంలో పూజారి, ముగ్గురు వ్యక్తులు చిక్కుకోగా.. హైడ్రా, పోలీసు సిబ్బంది వారిని రక్షించారు. నాగోల్ వద్ద వరద ప్రవాహం శిల్పారామం అంచును తాకింది. ఉప్పల్ భగాయత్ లేఅవుట్.. చెరువులా మారింది.

చాదర్‌ఘాట్ వద్ద వరదలో చిక్కుకుపోయిన రసూల్‌పుర కాలనీకి చెందిన నలుగురు వ్యక్తులు ఇంటిని ఖాళీ చేసేందుకు ససేమిరా అనడంతో.. జీహెచ్ఎంసీ అధికారులు వారికి డ్రోన్ సాయంతో ఆహారం అందించారు.

మూసానగర్, రసూల్‌పుర, వినాయకవీధి, శంకర్‌నగర్, పద్మాకాలనీ, తదితర ప్రాంతాల్లోని 1,460 మందికి 10 కేంద్రాల్లో పునరావాసం కల్పించి ఆహారం, తాగునీరు, ఇతర సౌకర్యాలను సమకూర్చినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. శనివారం సాయంత్రానికి నదిలో వరద ఉద్ధృతి తగ్గడంతో.. రాత్రికి పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది.

పై నుంచి వస్తున్న వరదతో నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ రిజర్వాయర్ నీటిమట్టం భారీగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి రికార్డు స్థాయిలో 41,448 క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. అప్రమత్తమైన అధికారులు శనివారం ఉదయం ప్రాజెక్టు తొమ్మిది క్రస్టుగేట్లు ఎత్తి 44,671 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా 3.96 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో ఉంది.

ఎటు చూసినా వరదే.. జలదిగ్బంధంలో ఎంజీబీఎస్

ఊరెళ్లేందుకు వచ్చి.. ఉసూరుమని!

దసరా పండక్కి సొంతూళ్లకు వెళ్లేందుకు ఎంజీబీఎస్ చేరిన ప్రయాణికులను వరద ఉసూరుమనిపించింది. ప్రధాన ప్రవేశ మార్గంతోపాటు ప్లాట్‌ఫాంలు, అలైటింగ్ పాయింట్, పరిసర ప్రాంతాలన్నీ నీటిలో చిక్కుకున్నాయి. ఒక్క బస్సు కూడా అక్కడి నుంచి కదల్లేని పరిస్థితి. దీంతో కొన్ని సర్వీసుల్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ముందుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు కుటుంబసమేతంగా వచ్చి బస్సులు తాత్కాలికంగా రద్దైన విషయం తెలుసుకుని ఇళ్లకు తిరిగెళ్లారు. ఆర్టీసీ ప్రత్యామ్నాయంగా నగర శివారు ప్రాంతాల నుంచి బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

ఎంజీబీఎస్‌లోకి వెళ్లేందుకు వచ్చి గౌలిగూడ వద్ద వరద నీటిలో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సెలవులకు వచ్చి.. మృత్యుఒడికి

మక్తల్ గ్రామీణం, మదనాపురం, న్యూస్‌టుడే: నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని అనుగొండ గ్రామానికి చెందిన జమున, సురేశ్ దంపతుల పెద్ద కుమారుడు ఆదిత్య(11) హైదరాబాద్‌లో అమ్మమ్మ వద్ద ఉంటూ ఐదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. ఇంటి ముందు ఉన్న పెంకుల షెడ్డులో పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. ఈ షెడ్ రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు దెబ్బతిని ఇనుప పైపులు బాలుడిపై పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

కాపాడిన ఫోన్ లైట్

కురుమయ్యను జేసీబీతో ఒడ్డుకు తెస్తున్న పోలీసులు

వరద నీటిలో చిక్కుకున్న ఓ వ్యక్తిని వనపర్తి జిల్లా మదనాపురం పోలీసులు కాపాడారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని కారుకొండ గ్రామానికి చెందిన రాగుల కురుమయ్య శుక్రవారం రాత్రి కురుమూర్తి స్వామి దేవస్థానానికి వెళ్లేందుకు వనపర్తిరోడ్ రైల్వేస్టేషన్‌లో దిగారు. అప్పటికే లో లెవల్ వంతెనపై వరద పారడంతో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఆయన నడుచుకుంటూ లో లెవల్ వంతెన వద్దకు చేరుకున్నారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, ముగ్గురు కానిస్టేబుళ్లు వారిస్తున్నా వారి కళ్లుగప్పి పొలాల వెంట లో లెవల్ వంతెనపైకి చేరుకొని దాటేందుకు ప్రయత్నించే క్రమంలో చిక్కుకున్నారు. అక్కడే ఉన్న రెయిలింగ్‌ను పట్టుకొని గట్టిగా కేకలు వేస్తూ ఫోన్ లైట్‌వేసి పోలీసుల వైపు చూపించారు. పోలీసులు వెంటనే జేసీబీని తెప్పించి కురుమయ్యను ఒడ్డుకు చేర్చారు.

# భారత్ - పాక్.. తొలిసారి టైటిల్ పోరులో దాయాదులు

ఆసియాకప్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. ఆదివారం దుబాయ్ వేదికగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ ముఖాముఖి పోరులో తలపడబోతున్నాయి. టోర్నీ 41 ఏండ్ల సుదీర్ఘ చరిత్రలో తొలిసారి టైటిల్ పోరులో బరిలోకి దిగుతున్న దాయాదులు అమీతుమీ తేల్చుకునేందుకు సర్వశక్తులతో సమాయత్తమయ్యాయి. ఇప్పటికే రెండుసార్లు పాక్‌ను పాతరేసిన భారత్..ముచ్చటగా మూడోసారి మట్టికరిపించాలన్న పట్టుదలతో ఉంది. పరాజయాలకు ప్రతీకారం కోసం పాక్ కదన కుతూహలంతో ఉన్నది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలోఆసియా పోరు ప్రతిష్ఠాత్మకంగా మారింది.

పాక్‌పై తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు భారత్ కసితో ఉంటే..తమదైన రోజున ఎంతటి ప్రత్యర్థినైనా ఓడిస్తామని పాక్ బీరాలు పలుకుతున్నది. ఆసియాకప్‌ను ఇప్పటికే 'షేక్‌హ్యాండ్' ఓ కుదుపు కుదుపగా హరిస్ రవూఫ్, ఫర్హాన్ రెచ్చగొట్టే విన్యాసాలు పుండు మీద కారం చల్లినట్లు ఉంది. అసలు పాక్ తమకు ప్రత్యర్థి కాదని కెప్టెన్ సూర్యకుమార్ తీసిపారేయగా, దీటైన బదులు ఇస్తామని ప్రత్యర్థి సవాలు విసురుతున్నది. ఈ నేపథ్యంలో సండే బ్లాక్‌బస్టర్ దసరా ధమాకాగా మారనుంది.

దుబాయ్: ఆసియాకప్‌లో భారత్‌ది అప్రతిహత జైత్రయాత్ర. 1984లో మొదలైన ఆసియా టోర్నీ ప్రస్థానంలో టీమ్‌ఇండియాదే స్పష్టమైన ఆధిపత్యం. ఇప్పటికి ఎవరికి అందని రీతిలో రికార్డు స్థాయిలో ఎనిమిది సార్లు టైటిల్ దక్కించుకున్న టీమ్‌ఇండియా తొమ్మిదోసారి టైటిల్‌పై కన్నేసింది. మరోవైపు మనకు పూర్తి భిన్నంగా రెండంటే రెండు సార్లు టైటిల్ గెలిచిన పాక్..భారత్‌కు దీటైన పోటీనిచ్చేందుకు తహతహలాడుతున్నది. ఆదివారం ఇరు జట్ల మధ్య ఆసియా కప్ ఫైనల్ పోరు జరుగనుంది.

టోర్నీలో అపజయమెరుగని భారత్ ఓవైపు అయితే, పడుతూ లేస్తూ సాగుతున్న ప్రయాణం పాక్‌ది. కానీ అనిశ్చితికి మారుపేరైన టీ20లో ఆ రోజు ఎవరు బాగా ఆడితే వారిదే విజయం. పాక్‌తో 15 టీ20ల్లో 12 సార్లు భారత్ గెలువడం మన ఆత్మవిశ్వాసాన్ని పెంచేది కాగా, ప్రత్యర్థికి ఒకింత ఒత్తిడి చేకూర్చేదే. శ్రీలంకతో ఆఖరి సూపర్-4 పోరులో టీమ్‌ఇండియా అద్భుత ప్రదర్శన కనబరచడం ఫైనల్‌కు ముందు మన సన్నాహాన్ని మరింత మెరుగుపర్చింది. మరోవైపు టోర్నీలో నిలువాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో పాక్ వరుస విజయాలతో ఫైనల్ చేరింది. బలాల పరంగా చూస్తే భారత్‌దే ఆధిపత్యం కనిపిస్తున్నప్పటికీ పాక్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు. టాపార్డర్ కీలకం: పాక్‌తో ఫైనల్లో టీమ్‌ఇండియాకు టాపార్డర్ కీలకం కానుంది. యువ ఓపెనర్ అభిషేక్‌శర్మ సూపర్ ఫామ్ మీద ఉండటం మనకు బాగా కలిసొచ్చే అంశం. ఓవైపు సహచర ఓపెనర్ గిల్ వరుసగా విఫలమవుతున్నా..అభిషేక్ హ్యాట్రిక్ అర్ధసెంచరీలతో దుమ్మురేపుతున్నాడు. ప్రత్యర్థితో సంబంధం లేకుండా పరుగుల వరద పారిస్తున్నాడు. పాక్‌తో ఫైనల్లోనూ ఇదే జోరు కొనసాగిస్తే తొమ్మిదో సారి మన టైటిల్ ఆశలు నెరవేరినట్లే. బుమ్రా, దూబె రాక ఖాయం కాగా, స్పిన్ ద్వయం కుల్దీప్, వరుణ్ చెలరేగితే పాక్‌ను కట్టడి చేయవచ్చు.

జట్ల అంచనా.. భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్(కెప్టెన్), తిలక్, శాంసన్, హార్దిక్, శివమ్‌దూబే, అక్షర్, కుల్దీప్, వరుణ్, బుమ్రా.

పాకిస్థాన్: ఫర్హాన్, జమాన్, ఆయూబ్, హుస్సేన్, నవాజ్, సల్మాన్(కెప్టెన్), అష్రఫ్, హరిస్, ఆఫ్రిదీ, రవూఫ్, అబ్రార్.

ఆట మాత్రమే.. యుద్ధం కాదు.. ఆసియాకప్‌లో దాయాదులు భారత్, పాకిస్థాన్ పోరుకు సర్వం సిద్ధమైంది. క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొన్నది. టోర్నీలో ఇప్పటికే రెండుసార్లు పాక్‌ను మట్టికరిపించిన టీమ్‌ఇండియా మూడోసారి ఓడించాలన్న పట్టుదలతో ఉంది. అయితే భారత్, పాక్ మ్యాచ్‌లో భావోద్వేగాలు రెచ్చగొట్టి తమకు లబ్ధి పొందాలన్న శక్తులు రెండు దేశాల్లో సమాయత్తమవుతున్నాయి. క్రికెట్ మ్యాచ్‌కు మతం, రాజకీయ రంగు పులమటం నిజంగా అత్యంత విషాదం. భారత్, పాక్ పోరాడటం ఇది కొత్త కాదు, ఆఖరి సారి కాదు. మ్యాచ్ గెలిచినప్పుడు కొందరు విపరీత పోకడలు కనబరుస్తున్నారు. అసలు ఇంతటి వివాదాలకు కారణమవుతున్న ఆసియాకప్‌లో భారత్ పోటీపడటం, దానికి బీసీసీఐ అభ్యంతరం చెప్పకపోవడం నిజయంగా ఆశ్చర్యం కల్గిస్తున్నది. బీసీసీఐకి కాసుల పంటకు దేశాన్ని కుదువ పెట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. అత్యంత సంపన్న బోర్డుగా బీసీసీఐ క్రికెట్‌ను ఎలా శాసిస్తుందో మనం చూస్తున్నదే. కాకపోతే ఇరు దేశాల్లోని కొంత మంది ప్రజలు దీన్ని జీవన్మరణ సమస్య చేయడం దుర్మార్గం. భారత్, పాక్ మధ్య క్రికెట్ వివాదాలు కొత్తవి కావు. పాక్ అనైతికి బౌలింగ్‌కు సమాధానంగా మ్యాచ్‌ను విరమించిన బిషాన్‌సింగ్ బేడీ గతంలో వార్తల్లో నిలిచాడు. అంపైరింగ్‌లో పాకిస్థాన్ వివాదాలు కొత్తవి కావు. ఈ మధ్య భారత్ ఆధిపత్యం ప్రదర్శిస్తున్నప్పటికీ గతంలో పాక్ గొప్ప జట్టు అన్న విషయం మర్చిపోరాదు. హఫీజ్‌ఖాన్, మాజీద్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, సర్ఫరాజ్ నవాజ్, జహీర్ అబ్బాస్, మియాందాద్, మదస్సర్ నాజర్, వసీం అక్రమ్, వకార్ యూనిస్, షాహిద్ ఆఫ్రిది, సయిద్ అన్వర్, షోయబ్ అక్తర్, అబ్దుల్ ఖాదిర్, ఇంజామాముల్ హక్, యూసుఫ్ యోహనా వంటి హేమాహేమీలు పాక్‌ను బలమైన జట్టుగా మార్చారు. అయితే భారత్‌కు లాలా అమర్‌నాథ్, గవాస్కర్, కపిల్‌దేవ్, గుండప్ప విశ్వనాథ్, బేడీ, చంద్రశేఖర్, ప్రసన్న లాంటి వారు పాక్‌తో పోరాడారు. ఐపీఎల్ ఆగమనంతో భారత క్రికెట్ రూపురేఖలు మారిపోయాయి. కోహ్లీ, రోహిత్, సూర్యకుమార్ లాంటి క్రికెటర్ల ఆటతో భారత్ చిరస్మరణీయ విజయాలు సాధించింది.

అంతమాత్రాన పాక్‌పై విజయాన్ని భూతద్దంలో చూడటం సరికాదు. ఇక్కడ భారత ప్రేక్షకులు ఒకటి గుర్తుంచుకోవాలి. బెన్సన్ హెడ్జెస్ వరల్డ్‌కప్ తర్వాత దశాబ్దం పాటు పాక్ చేతిలో ప్రతీసారి ఓటమిపాలయ్యాం. షార్జాలో మియాందాద్ ఆఖరి బంతికి సిక్స్ కొట్టి పాక్‌ను గెలిపించడం ఎవరం మర్చిపోం. ఆ తర్వాత కెనడాలో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో తొలిసారి దేబశిష్ మహంతి సూపర్ బౌలింగ్‌తో పాక్‌ను ఓడించాం. కానీ సిరీస్‌ను పాక్ 3-2తో కైవసం చేసుకుంది. ఆ తర్వాత 1996 వరల్డ్‌కప్‌లో పాక్‌పై జడేజా అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన అభిమానుల మదిలో ఇప్పటికీ మెదలుతూనే ఉంటుంది. పాకిస్థాన్‌లో లంక జట్టుపై ఉగ్రదాడి తర్వాత ఏ జట్టు అక్కడ ఆడేందుకు ముందుకు రాలేదు. 1992 ప్రపంచకప్ తర్వాత పాక్ మళ్లీ గెలువలేదు. ఇతర క్రీడల్లో భారత్‌పై పాక్ గెలుస్తున్నా..క్రికెట్‌లో మాత్రం కొందరు యాంకర్లు యుద్ధోన్మోదాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మధ్య మైదానంలో రవూఫ్, ఫర్హాన్ రెచ్చగొట్టే విన్యాసాలు ఈ క్రీడకు మచ్చ తెచ్చాయి. భావోద్వేగాలు గురయ్యేది ప్రేక్షకులు తప్పు..నిజమైన ప్లేయర్లకు రాగద్వేషాలు ఉండవు. గతంలో కత్తులు దూసుకున్న ఇమ్రాన్‌ఖాన్, మియాందాద్, జహీర్ అబ్బాస్, ఇంజామాముల్ హక్, గవాస్కర్, సిద్ధు, కపిల్‌దేవ్, గంగూలీ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి.

గతంలో ఒకసారి పాక్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన బాల్‌థాక్రె%ొ%మియాందాద్‌ను తన ఇంటికి ఆహ్వానించాడంటే ఆ అభిమాని ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఎన్నో దేశాలు యుద్ధాల్లో తలపడ్డాయి. వాటిని దృష్టిలో పెట్టుకుని క్రీడల్లో విజయం సాధించాలనుకోవడం పొరపాటు. ఏ జట్టు మంచి ఆటను ప్రదర్శిస్తే ఆ రోజు విజయం వారిని వరిస్తుంది. ఆదివారం మ్యాచ్‌లో ఎవరు గెలిచినా, ఓడినా క్రీడాస్ఫూర్తితో అంగీకరించాలి. అనవసర భావోద్వేగాలు రెచ్చగొట్టవద్దు. క్రికెట్ ఇప్పుడు జెంటిల్మన్ గేమ్ కాదు..ఇప్పుడు మర యంత్రం. మ్యాచ్‌లో అనవసర విషయాలు చొప్పించి, ఉద్రిక్తలు రెచ్చగొట్టి పబ్బం గడుపుతున్నారు. వారి నుంచి దూరంగా కేవలం క్రికెట్‌ను ఆస్వాదిస్తూ ఎవరు గెలిచినా ఆటకు జై కొట్టాలి. ఇది ఆట మాత్రమే, యుద్ధం కాదు.

## ఆర్25 మీమ్ కలెక్షన్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించిన మాగంటి సునీత గోపినాథ్

ఏ ఎం న్యూస్, జూబ్లీహిల్స్ :



యూసఫ్ గూడ డివిజన్( జూబ్లీహిల్స్ నియోజక వర్గం)పరిధిలోని ఎల్ ఎన్ నగర్ మజీద్ సెంటర్ లో భారతీయ రాష్ట్ర సమితి పార్టీ నాయకులు ఫయీం యజమానిగా వారు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్25 మీమ్"లెదర్ కలెక్షన్" షాప్ ప్రారంభోత్సవం కార్యక్రమానికి హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన షాప్ ని ఘనం గా ప్రారంభించారు జూబ్లీహిల్స్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్. ఈ కార్య క్రమంలో వారి కుమార్తె మాగంటి అక్షర పాల్గొన్నారు. అదే విధంగా షాప్ యాజమాని ఫయీం వారిని ఘనం గా శాలువాతో సత్కరించారు. అనంతరం ఫయీం శుభాకాంక్షలు తెలియజేశారు మాగంటి సునీత గోపినాథ్. ఈ సందర్భం గా ఫహీం మాట్లాడుతూ మా దగ్గర వివిధ రకాల లెదర్ షూస్( బ్రాండ్),షార్ట్స్, పాంట్స్,టీ షర్ట్స్,ఫ్యాషన్ కి సంబంధించిన అన్ని వస్తువులు బ్రాండ్ తో లభ్యమవుతాయి అని తెలిపారు మేము పిలవగానే వచ్చి మా నూతన షాప్ ను ప్రారంభించిన మాగంటి సునీత గోపినాథ్ అమ్మ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు.

## మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించండి: లంకాల దీపక్ రెడ్డి

ఏ ఎం న్యూస్ జూబ్లీహిల్స్ :
భారత రాష్ట్ర ప్రధాని నరేంద్ర మోదీ భారత దేశం ప్రజలకు అందించే సందేశం మన్ కీ బాత్ ఆదివారం(28/9/2025) ఉదయం 10.30 గంటలకు జూబ్లీహిల్స్ నియోజక వర్గం ఎల్లా రెడ్డి గూడా నాగార్జున కమిటీ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్ రెడ్డి పత్రికా ప్రకటన పూర్వకముగా పేర్కొన్నారు ఈ కార్య క్రమానికి ప్రతి ఒక్కరు వచ్చి వీక్షించి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు ఈ కార్య క్రమానికి కేంద్ర మంత్రి బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

## పేదలకు భూములివ్వడం అసాధ్యం..

హైదరాబాద్, సెప్టెంబర్ 27:
ఇకపై పేదలకు ప్రభుత్వం భూములు ఇవ్వడం అసాధ్యమని, అప్పుడు ఇందిరమ్మ ఇచ్చింది కానీ ఇప్పుడు ఇవ్వలేమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పుడు ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవని స్పష్టంచేశారు. ఈ మేరకు శనివారం మల్లేపల్లిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ) ప్రారంభోత్సవంలో పా ల్గొన్న సీఎం మాట్లాడుతూ 'గతంలో ఇందిరాగాంధీ ఉన్నప్పుడు సీలింగ్ ల్యాండ్ యాక్ట్ తీసుకొచ్చి జమీందార్ల వద్ద ఉన్న భూములను పేదలకు పంచారు. ప్రభుత్వం వద్ద ఆస్తులున్నప్పుడు ఇండ్ల పట్టాలు, ఇండ్లు, వ్యవసాయానికి భూములు ఇచ్చారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం వద్ద పంచడానికి భూములు లేవు. ప్రభుత్వ కార్యాలయాలు కట్టడానికే భూమి లేదు.. శ్మశాన వాటికలకు కేటాయించడానికి కూడా భూమి లేదు. ఇక పేదలకు భూమి ఇవ్వడం అనేది అసాధ్యం' అని స్పష్టంచేశారు. ఇంజినీరింగ్ పిల్లలే గంజాయి సరఫరా చేస్తున్నారని అన్నారు. ఇటీవల పట్టుకున్న కేసుల్లో ఈ విషయం వెల్లడైందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక విద్యార్థులకు ఉద్యోగం దొరకకపోవడంతో మొదట గంజాయి అలవాటు చేసుకొని, ఆ తర్వాత అవసరాల కోసం గంజాయి వ్యాపారం చేసే పరిస్థితుల్లోకి విద్యార్థులు వెళుతున్నారని వాపోయారు. కొన్ని పనులు తనతో కాకపోతే మంత్రి శ్రీధర్‌బాబు తో చెప్పిస్తుంటానని తెలిపారు. ఆర్థిక మంత్రి కూడా శ్రీధర్‌బాబుకు దగ్గరని, మేం చెబితే వినడు కానీ.. ఆయన చెప్పగానే సరే అంటారని పేర్కొన్నారు.

గ్రూప్-1 నియామక కార్యక్రమంలో సీఎం రేవంత్ ఆర్ఎంపీలపై చేసిన వ్యాఖ్య లు వాళ్లను అవమా నించేలా ఉన్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీఎస్‌పీఎస్సీలో ఆర్ఎంపీ డాక్టర్లను మెం బర్లుగా వేశారని, వాళ్ల విజ్డం ఎంత..? వాళ్లకు ఉన్న నాలెడ్జ్ ఎంత? అని రేవంత్ ప్రశ్నించారు. కాగా, ఇప్పటి వరకు టీఎస్‌పీఎస్సీ లో ఆర్ఎంపీలను సభ్యులుగా నియమించలేదు. టీఎస్‌పీఎస్సీలో సభ్యుడిగా ఉన్న కరీంనగర్‌కు చెందిన డాక్టర్ చంద్రశేఖర్ ఆయుర్వేద వైద్యుడు. ఆయనకు పేదల వైద్యుడిగా మంచి పేరుంది. వాస్తవాలను దాచేసి సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ఎంపీలను సభ్యులుగా పెట్టారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి.

## విజయ్ సభలో తొక్కిసలాట..

కరూర్:



ప్రముఖ నటుడు, తమిళిగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తమిళనాడులోని కరూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన భారీ బహిరంగ సభలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సుమారు లక్ష మందికి పైగా కిక్కిరిసిన సభలో తొక్కిసలాట చోటుచేసుకోవడంతో 38 మందికి పైగా మరణించారు. వీరిలో 8 మంది చిన్నారులు, 16 మంది మహిళలు ఉన్నట్టు సమాచారం. ఈ దుర్ఘటనలో వందలాది మంది గాయపడ్డారు. 400 మందికి పైగా దవాఖానల్లో చికిత్స పొందుతున్నారని పోలీస్ అధికారి డేవిడ్‌సన్ దేవశిరావతం తెలిపారు. వీరిలో పార్టీ కార్యకర్తలు, మహిళలు, పిల్లలు అధికంగా ఉన్నారని చెప్పారు. విజయ్ రాక కోసం కార్యకర్తలు, అభిమానులు ఆరు గంటలకు పైగా ఎదురు చూస్తుండగా విజయ్ ఎట్టకేలకు ప్రత్యేక బస్‌లో వచ్చి దానిపై నుంచి ప్రసంగించడానికి ఉద్యుక్తుడు కావడంతో ఒక్కసారిగా తోపులాట చోటు చేసుకుంది.

విజయ్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తున్న సమయంలో జనసమూహం పెద్దయెత్తున పెరిగిపోయి అదుపు తప్పింది. అప్పటికే వందలాది మంది గాయపడ్డారు. చాలా మంది స్పృహ తప్పి పడిపోయారు. పరిస్థితిని గమనించిన కార్యకర్తలు నిర్వాహకులను అప్రమత్తం చేయడంతో విజయ్ తన ప్రసంగాన్ని ఆపారు. అయితే అన్ని వేల మంది జనాన్ని దాటుకుని అంబులెన్స్‌లు రావడం కష్టమైంది. గాయపడిన వారిని అతి కష్టం మీద దవాఖానలకు తరలించారు.

తొక్కిసలాట తర్వాతా కొనసాగిన ప్రసంగం

విషాద ఘటన అనంతరం కూడా విజయ్ ప్రసంగాన్ని కొనసాగించారు. కరూర్‌లో ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేస్తామన్న డీఎంకే తర్వాత ఆ నెపాన్ని కేంద్రంపైనే తోసివేసిందని విజయ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన డీఎంకే మంత్రి సెంథిల్ బాలాజీని ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు చేశారు. ఆయన తన పార్టీ డీఎంకే అగ్ర కుటుంబానికి ఏటీఎంగా పని చేశారని విజయ్ ఆరోపించారు. అక్రమార్జనను ఆ కుటుంబానికి ఇచ్చేవారన్నారు. బాలాజీని '10 రూపాయల మంత్రి' అని వ్యంగ్యంగా అన్నారు. అంతకు ముందు పశ్చిమ కొంగు ప్రాంతంలో విజయ్ మాట్లాడుతూ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకేకు ఓటు వేయడం అంటే అది బీజేపీకే ఓటు వేసినట్లేనని సంచలన వ్యాఖ్యలు చేశారు. డీఎంకే కుటుంబానికి బీజేపీతో అంతర్గత ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. అందుకే డీఎంకేకు ఓటు వేస్తే అది బీజేపీకే ఓటు వేసినట్టు అని పేర్కొన్నారు. టీవీకే సామాన్య ప్రజల గొంతుక అని అన్నారు.

తొక్కిసలాటకు ముందు, తర్వాత ఏం జరిగింది?

తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం మధ్యాహ్నానికి కరూర్ చేరుకోవాల్సి ఉండగా ఆరు గంటలు ఆలస్యంగా సభ ప్రారంభమైంది. అప్పటికే లక్ష మందికి పైగా జనం అక్కడ విజయ్ కోసం వేచి చూస్తున్నారు. ఆ ప్రదేశం జనంతో కిక్కిరిసిపోవడంతో పలువురు అప్పటికే స్పృహ కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇంతలో ఓ 9 ఏండ్ల బాలిక కనిపించడం లేదని ఆ బాలిక కుటుంబ సభ్యులు రోదిస్తూ వెదకడం మొదలుపెట్టారు. దీంతో అక్కడ ఒక్కసారిగా అలజడి చెలరేగింది. అభిమానులు విజయ్‌ని చూసేందుకు బస్సువైపుకు రావడంతో తొక్కిసలాట జరిగింది.

అప్పటికే గంటల కొద్దీ ఎండలో వేచి ఉన్న ప్రజలను చూసి విజయ్ తన ప్రసంగాన్ని నిలిపివేసి బస్సుపై నుంచి వాటర్ బాటిల్స్‌ని వారిపైకి విసిరారు. బస్సు వైపు దూసుకురావడానికి అభిమానులు కొందరు ప్రయత్నించడంతో అక్కడ కూడా గందరగోళం ఏర్పడింది. జనాన్ని కంట్రోల్ చేయాలంటూ విజయ్ పదేపదే భద్రతా సిబ్బందికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయింది. పోలీస్ ప్లీజ్ హెల్ప్ అంటూ విజయ్ పోలీసులకు పదే పదే విజ్ఞప్తి చేశారు. తొక్కిసలాటలో 30 మంది స్పృహ తప్పి పడిపోయారని అధికారులు తెలిపారు. అతి కష్టం మీద అంబులెన్సులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని దవాఖానలకు తరలించాయి.

నా హృదయం ముక్కలైంది: విజయ్

కరూర్ తొక్కిసలాట విషాదంపై విజయ్ స్పందించారు. 'నా హృదయం ముక్కలైంది. పదాలు వర్ణించలేని దుఃఖం, విచారంతో నేను విలవిల్లాడుతున్నాను' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన సోదర, సోదరీమణుల కుటుంబాలకు సంతాపం, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు.

# బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత కొండ లక్ష్మణ్ బాపూజీ

## - పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ



ఏ ఎం న్యూస్ శేర్లింగంపల్లి :
బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత,ఉద్యమకారుడిగా, ప్రజా స్వామిక మానవతావాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ పద్మశాలి సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ లో నిర్వహించిన జయంతి వేడుకలలో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సంద ర్భంగా గాంధీ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం, తెలంగాణ సాధన కోసం, తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ గర్వించే గొప్ప నేత అని, ఉద్యమ కారుడిగా, ప్రజాస్వామిక వాదిగా, పీడిత ప్రజల పక్షపాతిగా, నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకుడుగా పలుపార్శ్వాలతో కూడిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం రేపటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు. సాయుధ పోరాట కాలంలో చాకలి ఐలమ్మతో సహా పలువురికి న్యాయవాదిగా సేవలందించి వారి తరఫున న్యాయపోరాటం చేసిన ప్రజాస్వామిక వాది కొండా లక్ష్మణ్ బాపూజీ అని గుర్తు చేశారు. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం, సహకార రంగాల పటిష్టత కోసం, తన జీవిత కాలం కృషి చేసారని తెలిపారు. బహుజన నేతగా దేశవ్యాప్తంగా పద్మశాలీలను సంఘటితం చేసిన ఘనత కొండా లక్ష్మణ్ బాపూజీకే దక్కిందని తెలియచేసారు. బహుజన నేతగా, నేతన్నలైన పద్మశాలీలను సంఘటితం చేసారని, తెలంగాణ కోసం నాడు తన మంత్రి పదవికి రాజీనామా చేసిన బాపూజీ స్ఫూర్తి, మలి దశ తెలంగాణ సాధన పోరాటంలో ఇమిడి వున్నదని ,కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. రాష్ట్ర ఉద్యానవన విశ్వ విద్యాలయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. చేనేత రంగంలో ప్రతిభావంతులైన కళాకారులకు ఆయన పేరుతో అవార్డులను అందజేస్తూ, చేనేత కార్మికులైన పద్మశాలీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతున్నదని గాంధీ తెలియచేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, దొడ్ల రామకృష్ణ గౌడ్,జిల్లా గణేష్, మహమ్మద్, కరీం మరియు బిక్షమయ్యా, ఆంజనేయులు, ప్రకాష్ ,శివశంకర్, వంగరి విష్ణు, రాములు, వెంకటేశ్వర్లు, నవీన్, నర్సింగరావు, వెంకటనర్సిహ్మా, మోహన్, శ్రీనివాస్,నోముల ఆంజనేయులు ,దయానంద తదితరులు పాల్గొన్నారు.

## కెపిహెచ్బి కాలనీ నాల్గవ ఫేస్‌లో ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కెపిహెచ్బి కాలనీ నాలుగో ఫేస్‌లో శివధల్ యువసేన ప్రతినిధి క్రైత అరవి రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని టిపిసిసి ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి బండి రమేష్ సందర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శివ చౌదరి, సంధ్య పాల్గొన్నారు.

## కూకట్పల్లిలో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి నియోజకవర్గ పరిధిలోని కూకట్పల్లి పాత గ్రామంలో బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా కూకట్పల్లి ప్రాంతానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుండి బతుకమ్మను అందంగా పూలతో అలంకరించి తీసుకుని వచ్చి కూకట్పల్లి గ్రామంలో ఒకచోట ఉంచి వాటి చుట్టూ ఆడి పాడి ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కూకట్పల్లికి చెందిన కురుమయ్య గారి జగన్నాథ్రావు కుమార్తె కుర్మయ్య గారి శరణి ఏర్పాటు చేసిన బతు కమ్మ పలువురుని ఆకర్షించింది. ఆటపాటలతో బతుకమ్మను ఊరేగింపుగా తీసుకువెళ్లి కూకట్పల్లిలో నీ పిఎన్ఎం స్కూల్ సమీపంలో నిమజ్జనం చేశారు.

## కూకట్పల్లిలోని పలు ప్రాంతాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



దేవి శరన్నవరాత్రుల సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు తో కలిసి కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను, ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మండప నిర్వాహకులు, ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతించి సన్మానించారు. అనంతరం ఈటెల మాట్లాడుతూ శరన్నవరాత్రులు సత్యం, ధర్మం, న్యాయం, శాంతి కోసం చెడు శక్తులపై సత్సంకల్పం గెలిచే దివ్యోత్సవమని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సౌహార్దం, సన్మార్గం బలపడేందుకు ప్రతి ఒక్కరూ శక్తిమాతను ఆరాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్శన కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ప్రీతమ్ రెడ్డి, నియోజకవర్గం లోని బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## జీఎస్టీ తగ్గింపుతో వ్యాపారులకు వినియోగదారులకు మేలు
### - ఎంపీ ఈటెల రాజేందర్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ పన్నులు తగ్గించిన సందర్భంలో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ కూకట్ పల్లి నియోజకవర్గ పర్యటనలో భాగంగా కూకట్ పల్లి 'వై' జంక్షన్ వద్ద ఉన్న పలు వ్యాపార సంస్థల మోటార్ వెహికల్స్ షోరూమ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డీలర్స్, కస్టమర్స్ తో మాట్లాడి జీఎస్టీ తగ్గుదల వల్ల కలిగే లాభాల గురించి అడిగి తెలుసుకుని తగిన వివరాలు వారికి క్లుప్తంగా తెలియజేశారు. ప్రధాని శనరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వ్యాపార వర్గాలకు, వినియోగదారులకు సమానంగా లాభదాయకమవుతుంది అన్నారు. వాహనాల ధరలు తగ్గడం వల్ల సాధారణ కుటుంబాలు కూడా సులభంగా కొత్త వాహనాలను కొనుగోలు చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ఎంపీకి డీలర్స్ కస్టమర్స్ ను పరిచయం చేశారు.అనంతరం ఈటల రాజేందర్ కూకట్ పల్లీ బీజేపీ నాయకులతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు, కార్యక్రమంలో కూకట్ పల్లీ అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు,మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, నియోజకవర్గ పరిధిలోని బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయం ప్రాంగణంలో వసతి గృహ సముదాయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కృష్ణారావు

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :




కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శ్రీశైలం మల్లికార్జున భ్రమరాంబ ఆలయంలో తన తండ్రి కీర్తిశేషులు మాధవరం శివయ్య నారాయణరావు పేరు మీద కట్టించిన నూతన వసతి గృహాన్ని ఉదయం శుభముహూర్తాన కుటుంబ సభ్యులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూకట్పల్లి నియోజకవర్గం కార్యకర్తలు, నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కృపాకటాక్షములతో ప్రజలు తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ఆదరిస్తున్నారని తనవంతుగా ప్రజలకు ఉపయోగపడే విధంగా తండ్రి పేరుమీద ఈ వసతి గృహం కట్టించి దేవస్థానానికి అందించడం జరిగిందని తెలిపారు. ఆ శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.

## ఉచిత హెల్త్ క్యాంపు

ఏఎం న్యూస్ / యాదగిరిగుట్ట :



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి సందర్భంగా శ్రీ ధరణి మల్టీ స్పెషాలిటీ సహకారంతో యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో అఖిలభారత పద్మశాలి అన్న సత్రం ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. సత్రం ఉపాధ్యక్షులు చుంచు నాగ భూషణం బాపూజీ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు .ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ బాపూజీ చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేశారు 97 కులాలకు ప్రాతినిధ్యం కల్పించారనీ వారిని ఆదర్శంగా తీసుకోవాలి అనిరచ్చ శ్రీనివాస్ అన్నారు. కోశాదికారి బడుగు మల్లేశం ఈ కార్యక్రమంలో బిపి, షుగర్ టెస్టులు నిర్వహించి అవసర మైన వారికి మందులు ఇవ్వడం జరిగింది . శ్రీ ధరణి హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ రేవంత్ జనరల్ సర్జన్, డాక్టర్ రాకేష్ గౌడ్ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ స్రవంతి గైనకాలజిస్ట్ ,డాక్టర్ జగదీష్ బాబు ఆర్థోపెడిక్, డాక్టర్ రమేష్ ,హాస్పిటల్ ఎండి శ్రీకర్ అండ్ శ్రీలక్ష్మి, సీఈఓ మద్దెల కరుణాకర్, సహాయ కార్యదర్శి గుజ్జ బలరాం, పట్టణ సంఘం అధ్యక్షుడు ఎర్ర గంట వెంకటేష్, గంజి సూర్య నారాయణ, కోడూరి రాజు, ధర్మకర్తలు గుజ్జ నిర్మల, అంకం నరసింహ,పులగం భిక్షపతి, కైరం కొండ మధు, పులగం కైలాసం, బొమ్మ సూర్య నారాయణ, మిరియాల లక్ష్మి, ఎర్రగుంట్ల శేఖర్, మెరుగు మధు, రచ్చ లక్ష్మి బాయి, గొర్ల జ్యోతి, మెరుగు కిష్టయ్య, హేమలత ,భాగ్య లక్ష్మి, గురం వసంత,రవి, మహేష్, నరేందర్ శంకర్ ,స్వాతి,సంతోష సత్రం మేనేజర్ పాండు రంగం స్థానిక ప్రజలు ధర్మకర్తలు పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆడిన మాగంటి సునీత గోపినాథ్..

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



శనివారం జూబ్లీహిల్స్ యూసుఫ్ గూడా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన బతుకమ్మ వేడు కలకు జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని మాగంటి సునీత గోపీనాథ్, కుమార్తె మాగంటి అక్షర,మాగంటి దిశిర లు బతుకమ్మ వేడుకలో పాల్గొన్నారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలలో భాగం గా యూసుఫ్ గూడా డివిజన్ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్ చెక్ పోస్ట్ లోని మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన బతుకమ్మ పండుగ వేడుకలలో పాల్గొని వేలాదిగా వచ్చిన మహిళలతో వారు వివిధ విధాలుగా ఏర్పాటు చేసిన బతుకమ్మలతో వారి కోరిక మేరకు బతుకమ్మ ఆడి బతుకమ్మ అమ్మవారి కరుణ కటాక్షలకు పాత్రులు అయ్యారు. అనంతరం రాజ్‌కుమార్ పటేల్ సమక్షంలో బతుకమ్మ వేడుకలకు వచ్చిన మహిళలందరికీ కానుకగా బతు కమ్మ చీరలను అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల నాయకులు, స్థానిక నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. రాజ్ కుమార్ పటేల్ మాట్లాడుతూ అన్న స్వర్గీయ మాగంటి గోపినాథ్ (మన మధ్యలో లేకపోయినా) ప్రతి ఏడు వారు మహిళల కోసం ఎంతో వైభవం గా బతుకమ్మ వేడుకలను వారు ఘనంగా నిర్వహించేవారు అని, అదేవిధంగా ఎమాత్రం తగ్గకుండా ఈ ఏడు(2025) వారి సతీమణి మాగంటి సునీత గోపినాథ్ సూచనలతో ఘనంగా నిర్వహి ంచా మని, 5000 మందికి బతుకమ్మ చీరలను కానుకగా ఇచ్చామని తెలిపారు ఈ బతుకమ్మ చీర లను స్వయంగా రాజ్ కుమార్ పటేల్ ప్రతి మహిళకు ఓపికతో చివరి వరకు చీరలను ఇచ్చిన విషయం గురించి చీరలు తీసుకున్న మహిళలు మా ఎ.ఎం.న్యూస్ జూబ్లిహిల్స్ నియోజకవర్గ రిపోర్టర్‌తో మాట్లాడుతూ మాకు స్వర్గీయ మాగంటి గోపినాథ్(వారు బతుకమ్మ వేడుకలకు వచ్చిన ప్రతి మహిళ లకి చివరి వరకు స్వయంగా ఇచ్చిన) మాకు గుర్తుకు వచ్చారు అని వారిని గుర్తు చేసుకున్నారు.



## ఆంగ్ల కవితా గానంతో ఆకట్టుకున్న కవి సురేందరు

ఏ ఎం న్యూస్, ఓయూ:




తెలంగాణ ఇదరహి ఆదాబ్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతీలో నిర్వహించిన కవి సమ్మేళనంలో సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పగిడిపల్లి సురేందరు పాల్గొని ఆంగ్లంలో కవితా గానం చేశారు. 'మీలాదున్నబీ సల్లలాహు అలైహి వసల్లం' అనే అంశంపై సురేందరు చేసిన కవితాగానానికి ముగ్ధులైన నిర్వాహకులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. నంది అవార్డు గ్రహీత సాధనల వెంకటస్వామి, కీర్తి పురస్కార గ్రహీత రఘువీర్ ప్రతాప్ చేతుల మీదుగా సురేందరును శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యలమర్తి అనురాధ, గిడుగు శాంతికృష్ణ, సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ రషీద్, సాహిత్యవేత్తలు నాళేశ్వరం శంకర్, అన్వర్ పాషా తదితరులున్నారు.

## ఓయూలో ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల పోలింగ్ సందడి..
### ఓటు హక్కును వినియోగించుకున్న ఖదీర్, వెంకటేష్..

ఏ ఎం న్యూస్, ఓయూ:



ఉస్మానియా యూనివర్సిటీలో ఎన్జీవోస్ ఉద్యోగ సంఘాల ఎన్నికల సందడి మొదలైంది శనివారం ఉదయం నుండి పోలింగ్ ప్రారంభమైంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి భారీగా తరలివచ్చారు ఉస్మానియా యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. ఎన్జీవోస్ అసోసియేషన్ ప్యానెల్ ఖదీర్ ఖాన్, వెంకటేష్ ప్యానెల్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఎన్జీవోస్ ప్యానెల్ అధ్యక్షులు ఖదీర్ ఉపాధ్యక్షులు వెంకటేష్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్జీవోస్ ఖదీర్ ప్యానెల్ సభ్యులు వైస్ ప్రెసిడెంట్స్ బి. యాదగిరి, ఎస్. సుధీర్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. మల్లేష్, సెక్రటరీలు ఎం.డి వసీం అహ్మద్, జాటోతు నరసింహ, ఎస్. సుధాకర్, కోశాధికారి ఆర్. నర్సింగ్ రావులు భారీ మెజార్టీతో గెలుస్తామని ఆనందం వ్యక్తం చేశారు.

## బంగియ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శారదీయ దుర్గా పూజోత్సవం

ఏ ఎం న్యూస్, ఓయూ:



నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మల్లాపూర్‌లోని ఏఎన్ఆర్ గార్డెన్‌లో బంగియ సంఘం ఆధ్వర్యంలో శ్రీ శారదీయ దుర్గా పూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగియ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నేటి నుంచి అక్టోబర్ 2 వరకు దుర్గాపూజోత్స వ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అక్టోబర్ 1న దాండియా కార్యక్రమం ఉంటుందని, 2 న దుర్గా పూజ కార్యక్రమం ఉంటుందని ప్రతి ఒక్కరూ అక్టోబర్ 2 న జరిగే దుర్గా పూజ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## నాచారంలోని ఏఎన్ఆర్ గార్డెన్‌లో 2025 బిగ్గెస్ట్ ఇండోర్ దాండియా నైట్స్

ఏ ఎం న్యూస్, ఓయూ:



నవరాత్రి దాండియా మహోత్సవ్ ను పురస్కరించుకొని నాచారంలోని ఏఎన్ఆర్ గార్డెన్ లో 2025 బిగ్గెస్ట్ ఇండోర్ దాండియా నైట్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దాండియా మహోత్సవ్ లో భాగంగా యువత, పిల్లలు, కుటుంబ సభ్యులు దాండియా నృత్యాలతో ఉత్సాహంగా సందడి చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 27న ప్రారంభమైన దాండియా మహోత్సవ కార్యక్రమాలు ప్రతి రోజు రాత్రి 7 గంటలకు ప్రారంభము. 29వ ముగుస్తాయని, ఆసక్తి ఉన్నవారు సాయంత్రం ఏడు గంటలకు ఏఎన్ఆర్ గార్డెన్ లో నిర్వహించే దాండియా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొనవచ్చు అని కోరారు.

## ఫతేనగర్‌లో గార్మి షరీఫ్ ఉత్సవాలకు హాజరైన టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



మతపరంగా దేవుడి పేరు వేరైనా అందర్నీ చల్లగా చూసేది ఆ భగవంతుడు ఒక్కడేనని టిపిసిసి ఉపాధ్యక్షుడు జహీరాబాద్ పార్లమెంటు ఇంచార్జ్, కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహమ్మద్ మునీర్, అహ్మద్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్ గౌతమి నగర్ లో జరిగిన గ్యార్మి షరీఫ్ ఉత్సవాలకు రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమత సహనంతో ప్రజలు తమ తమ పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మహమ్మద్ మున్నేర్ ,సయ్యద్ అహ్మద్, బాబా భాయ్, హమీద్ ఖాన్, ఆసిఫ్ బాబా ,షబ్బీర్ నవీన్ ఖాన్, ఏషిన్, తదితరులు పాల్గొన్నారు.